ఫటా.. ఫట్...

కారుణ్య నియామకాలను చేపడుతున్నాం

● జితేందర్ రెడ్డి, జడ్పీ సీఈవో



ఆంధ్రజ్యోతి: కారుణ్య నియమకాల్లో తీవ్రజాప్యం జరుగుతుంది కదా..?

జడ్పీ సీఈవో: కొంత జాప్యం జరిగిన మాట వాస్తవమే. త్వరలోనే జిల్లా పరిషత్ పరిధిలో ఉన్న కారుణ్య నియమకాలన్నీ పూర్తి చేస్తాం. ప్రస్తుతం 39 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. రెండు, మూడు రోజుల్లోనే 27 నియామకాలను పూర్తి చేస్తాం. మిగిలిన 12 నియామకాలను త్వరలోనే పూర్తి చేస్తాం.

ఆంధ్రజ్యోతి: వేసవి పరిస్థితుల నేపథ్యంలో ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జడ్పీ సీఈవో: వేసవి పరిస్థితులను అధిగమించేందుకు ఇప్పటికే సమ్మర్ యాక్షన్‌ప్లాన్‌ను రూపొందించాం. ఇటీవలే కలెక్టర్ ఆధ్వర్యంలో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశాం. జిల్లావ్యాప్తంగా 7 మండలాల పరిధిలో 88 గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఇబ్బందులు ఉన్నట్లు గుర్తించాం. అందుబాటులో ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకోవడం, పొదుపుగా వాడుకోవాలని సూచిస్తున్నాం. అలాగే రూ.3 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు సైతం పంపించడం జరిగింది.

ఆంధ్రజ్యోతి: ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారా?

జడ్పీ సీఈవో: ప్రభుత్వ ఆదేశాలతో ఇప్పటికే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశాం. ప్రభుత్వం ఆదేశిస్తే రిజర్వేషన్ ప్రక్రియనే మిగిలి ఉంది. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సిద్ధంగా ఉన్నాం. బ్యాలెట్ పేపర్లు, ఫార్మాట్స్ కవర్స్, బుక్‌లెట్స్, తదితర ఎన్నికలకు సంబంధించి సామగ్రి అందుబాటులోనే ఉంది.

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ నిధులతో పాటు సొంతంగా ఎలా నిధులను సమకూర్చుకుంటున్నారు?

జడ్పీసీ ఈవో: జడ్పీకి అదనంగా ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికే ఉన్న 16 వ్యాపార గదులకు కొత్తగా టెండర్లు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. అలాగే జడ్పీ చైర్మన్ క్యాంపు కార్యాలయం పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో దివ్యాంగుల కోసం పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేసేందుకు ఆలోచిస్తున్నాం. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పనులను ప్రారంభిస్తాం.

ఆంధ్రజ్యోతి: జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల పెండింగ్ వేతనాలను ఎప్పుడు చెల్లిస్తారు?

జడ్పీసీ ఈవో: జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల గౌరవ వేతనాలు కొంత పెండింగ్‌లోనే ఉంది. గత ఆరు మాసాలకు పైగా వేతనాలు రావడం లేదు. ఇప్పటికే సభ్యుల పదవి కాలం ముగిసిపోయింది. ప్రభుత్వం నిధులను విడుదల చేయగానే సభ్యులకు గౌరవ వేతనాన్ని చెల్లిస్తాం.

- ఆదిలాబాద్, మార్చి 15(ఆంధ్రజ్యోతి)



● జిల్లాకేంద్రంలోని తాటిగూడ ప్రాథమిక పాఠశాలలో ఏఐ తరగతులను ప్రారంభిస్తున్న కలెక్టర్

సర్కారు బడుల్లో..
ఏఐ పాఠాలు

- జిల్లాలో 8 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఎంపిక
- చదువుల్లో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక బోధన
- ప్రాథమిక విద్య బలోపేతానికి ప్రభుత్వం వినూత్న కార్యక్రమం
- పాత కంప్యూటర్ సిస్టమ్స్, నెట్‌వర్క్ సేవలతో ఇబ్బందులు
- తొలి విడతలో నాలుగు పాఠశాలల్లో ఏఐ తరగతుల ప్రారంభం

ఆదిలాబాద్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో కృత్రిమ మేధాతో (ఏఐ) పాఠాలు బోధించేందుకు ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) సహాయంతో విద్యార్థులకు సులభతర పద్ధతిలో విద్యాబోధన చేస్తున్నారు. జిల్లాలో 3 మండలాల పరిధిల్లో 8 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేశారు. శనివారం తొలివిడతలో పైలెట్ ప్రాజెక్టుగా ఆదిలాబాద్ అర్బన్ ప్రాథమిక పాఠశాల తాటిగూడ, తలమడుగు మండలం దేవాపూర్ ప్రాథమిక పాఠశాల (తెలుగు), ఉర్దూ ప్రాథమిక పాఠశాల, ఖోడద్ ప్రాథమిక పాఠశాల మొత్తం నాలుగు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఏఐ ద్వారా పాఠాలు బోధించేందుకు తరగతులను ప్రారంభించారు. శనివారం జిల్లాకేంద్రంలోని తాటిగూడ ప్రాథమిక పాఠశాలలో కలెక్టర్ రాజర్షిషా ఏఐ తరగతులను ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం మొదట ఆరు జిల్లాల్లో ఏఐ ద్వారా ఆన్‌లైన్ లర్నింగ్ విధానాన్ని ప్రారంభించింది. అక్కడ ఆశించిన ఫలితాలు రావడంతో మిగిలిన 27 జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగానే జిల్లాలో 8 ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేసి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా విద్యార్థులకు బోధన కార్యక్రమాన్ని చేపడుతోంది. ప్రధానంగా 3, 4, 5 ప్రాథమిక విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను మరింత బలోపేతం చేసేందుకు ఈకే స్టెప్ అనే ఆర్గనైజేషన్‌తో కలిసి ఏఎక్స్‌ఎల్ అనే ఏఐ ఆధారిత వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులను నిర్వహిస్తున్నారు. ఇప్పటికే జిల్లా అధికారులకు రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

ఆకట్టుకునేలా బోధన

చదువుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఏఐ ద్వారా ఆకట్టుకునేలా విద్యా బోధన చేయనున్నారు. 3, 4, 5వ తరగతులకు చెందిన విద్యార్థులను గ్రూపులుగా విభజించి భాషా, గణిత అభ్యాసనాలపై పాఠాలు బోధిస్తారు.



● విద్యార్థికి కంప్యూటర్ పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తూ..

ఒక్కో గ్రూపులో ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేస్తారు. 20 నిమిషాల వ్యవధిలో ఏఐ ద్వారా బోధన చేపడుతారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యానికి అనుగుణంగా ఏఐ సరళమైన పద్ధతిలో బోధన అందిస్తుంది. అసలు విద్యార్థులకు ఎంత వరకు పాఠాలు అర్థమవుతున్నాయి అనే దానిని గుర్తించి అర్థమయ్యే

వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక బోధన

: ప్రణీత, డీఈవో, ఆదిలాబాద్

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక బోధన చేపడుతాం. జిల్లాలో తొలివిడతలో 8 ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేశాం. శనివారం నాగులు పాఠశాలల్లో ఏఐ తరగతులను ప్రారంభించాం. ఒక్కో పాఠశాలకు 5 కంప్యూటర్ సిస్టమ్స్‌ను అందజేశాం. తొలిరోజు కొంత నెట్‌వర్క్ ఇబ్బందులు ఎదురయ్యాయి. వెంటనే పరిష్కరించి తరగతులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఏఐ విధానంపై పలువురు ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణను ఇవ్వడం జరిగింది. దశల వారీగా జిల్లాలో ఈ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

రీతిలో పాఠాలు బోధించడం ఏఐ ప్రత్యేకతగా చెబుతున్నారు. అంతేకాకుండా ఎప్పటికప్పుడు విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని పసిగడుతూ గతంతో పోలిస్తే పురోగతి ఉందా? లేదా? అనే దానిని పరిశీలించి విద్యార్థుల అభ్యాసనంపై ప్రత్యేక నివేదికను రూపొందిస్తారు. ఇలా చదువుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిని సారించడంతో మెరుగైన ఫలితాలను రాబట్టవచ్చునని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

తప్పుగా చదివితే గుర్తుపట్టేస్తుంది..

రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక విద్యా బలోపేతానికి వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగానే ఏఐ ద్వారా విద్యార్థులకు బోధన చేస్తుంది. దీనిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం జిల్లాలోను ప్రయోగాత్మకంగా అమలు చేస్తుంది. ముఖ్యంగా ఏఐ ద్వారా భాషా, గణితంలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి తక్కువ సమయంలోనే సి-గ్రేడ్ నుంచి ఏ-గ్రేడ్‌కు మార్చే విధంగా ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఉదాహరణకు ఒక విద్యార్థి దేనినైనా తప్పుగా చదివితే దానిని వెంటనే గుర్తించి ఏఐ ఆ విద్యార్థులకు సరైన పద్ధతిలో పలుమార్లు ప్రాక్టీస్ చేయిస్తుంది. దీని ద్వారా చదువులో వెనుకబడిన విద్యార్థుల్లో తక్కువ సమయంలోనే మెరుగైన ఫలితాలను రాబట్టే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా భాషా, గణితంలోనే ఎక్కువ మంది విద్యార్థులు

(తరువాయి 4వ పేజీలో...)



● తలమడుగు మండలం దేవాపూర్ ప్రాథమిక పాఠశాలలో మొరాయించిన నెట్‌వర్క్ సేవలు



దేవాపూర్‌లో ఆర్టిఫిషియల్ విద్యా బోధనను ప్రారంభిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్



ఖోడద్ పాఠశాలలో ప్రారంభిస్తున్న జిల్లా విద్యాధికారి ప్రణీత

ఏఐతో విద్యా బోధన మరింత మెరుగు

● తాటిగూడ ప్రభుత్వ పాఠశాలలో కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్ రూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థుల విద్య సామర్థ్యాల పెంపు కోసం కృత్రిమ మేధా(ఏఐ)ఎంతగానో దోహద పడుతుందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఆదిలాబాద్ తాటిగూడ ప్రభుత్వ పాఠశాలలో ఏవిద్య బోధన తరగతులను ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఏఐ ప్రాముఖ్యత వివరించడంతోపాటు తల్లిదండ్రుల్లో ఉన్న అపోహలను కలెక్టర్ నివృత్తి చేశారు. అనంతరం విద్యార్థులకు ఏఐ బోధనలను పరిశీలించారు. డీఈవో ప్రణీత, ఎంఈవో సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, పట్టణంలోని శాంతినగర్‌లోని ఈవీఎం గోదాంను జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి శనివారం పరిశీలించారు. త్రైమాసిక పరిశీలనలో భాగంగా ఈవీఎం గోదాంను పరిశీలించి సంబంధిత రిజిస్టర్‌లో సంతకం చేశారు. చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల నాయకులు అధికారులు పాల్గొన్నారు. అలాగే, వంద రోజుల టీబీ కార్యక్రమంలో భాగంగా శనివారం అంకోలి పీహెచ్‌సీలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీబీ రోగులకు నీక్షయ పోషన్ కిట్స్‌ను కలెక్టర్ రాజర్షిషా అందజేశారు. అంకోలి పీహెచ్‌సీ పరిధిలో నిక్షయ్ పోషన్ కిట్స్ డిస్ట్రిబ్యూషన్ చేశారు. పీహెచ్‌సీలో 125 టీబీ కేసులు ఉన్నాయి.



ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

● దేవాపూర్‌లో ప్రారంభించిన అసిస్టెంట్ కలెక్టర్

తలమడుగు: మండలంలోని దేవాపూర్ ప్రాథమిక పాఠశాల తెలుగు, ఉర్దూ మీడియం విద్యార్థుల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ ఆధారిత బోధన విధానాన్ని ఏ ఎక్సెల్ వారి, సహకారంతో అసిస్టెంట్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయ ప్రారంభించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక విద్యపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం కల్పిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏ1) ద్వారా మూడు, నాలుగు, ఐదవ తరగతిలోని వెనుకబడిన(భాష గణితం) విద్యార్థులకు భాషా నైపుణ్యాలు గణిత సామర్థ్యాల మీద పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు ఈ కంప్యూటర్ ఆధారిత విద్య చాలా ఉపయోగ పడుతుందన్నారు.

అలాగే, మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఖోడద్‌లో ప్రాథమిక విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ1) విద్యను బోధించే ప్రత్యేక కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, చిన్న వయసులోనే విద్యార్థులకు ఆధునిక సాంకేతికతపై అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. మూడు నుంచి ఐదో తరగతి విద్యార్థులకు కంప్యూటర్ల సహాయంతో ఏ1 పాఠాలు అందించనున్నట్టు వెల్లడించారు.



తాంసిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్

శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం

తాంసి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనగల కొనుగోలు కేంద్రాన్ని శనివారం డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని స్థానిక సహకార సొసైటీ గోదాంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భోజారెడ్డి మాట్లాడుతూ రేవంత్ సర్కార్ రైతుల ప్రభుత్వం అని అన్నారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలను ప్రారంభించిందని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో సీఈవో కేశవ్, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● 'కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి'

నేరడిగొండ: శనగల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ సాబ్లే కిషోర్‌సింగ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో స్థానిక పీఏసీఎస్‌లో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదేశాల మేరకు చైర్మన్ సాబ్లే కిషోర్ సింగ్ మార్క్‌ఫెడ్ వారిచే కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తేదీల వారీగా శనగలు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజాన్, బోథ్ ఏఎంసీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్ రావు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నానక్‌సింగ్, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇచ్చోడకు అంబేద్కర్ మనవడు

ఇచ్చోడ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక హెచ్‌పీ గ్యాస్ ఎదురుగా నిర్వహించ తలపెట్టిన భగవాన్ బుద్ధ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి డా.బీఆర్ అంబేద్కర్ మనవడు డా.భీంరావ్‌యశ్వంత్‌రావు అంబేద్కర్ రానున్నారు. మండలంలోని జామ్ని గ్రామం నుంచి ఉదయం 11 గంటలకు బుద్ధవిహార్ బుద్ధమూర్తి శోభాయాత్ర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం అంబేద్కర్ బుద్ధుని జీవితాధారాలపై కవ్వాలీ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, విజయవంతం చేయాలని కోరారు.

బార్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

ఆదిలాబాద్ రూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్నట్లు ఎన్నికల అధికారి పి.డేవిడ్ పేర్కొన్నారు. ఎలక్షన్ వివరాలను శనివారం మీడియాకు వెల్లడించారు. ఈనెల 17 నుంచి 20 వరకు నామినేషన్‌ల స్వీకరణ, 22న నామినేషన్ విత్ డ్రా ఉంటుందన్నారు. ఈనెల 27న ఎన్నికలు నిర్వహిస్తామని అదే రోజు కౌంటింగ్‌తో పాటు రిజల్ట్ ప్రకటిస్తామన్నారు. అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్స్ వినోద్ ఎండి అబ్దుల్లా ఖాన్ ఉన్నారు.

ప్రారంభమైన హరినామ సప్తాహ

ఇంద్రవెల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక హనుమాన్ మందిరంలో శనివారం ఆందునాయక్ తండా మహరాజ్ రాంసింగ్ నేతృత్వంలో అంగరంగ వైభవంగా అఖండ హరినామ సప్తాహ ప్రారంభమైంది. ఈ సందర్భంగా మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. గత 23 ఏళ్ల నుంచి ప్రతీయేడు అంగరంగ వైభవంగా ఏడురోజుల పాటు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం వేకువజామునే కాకడ హారతితో పాటు రాత్రివేళ్లలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహరాజులచే సంకీర్తనలు నిర్వహిస్తారు.

పదవ తరగతిలో

వంద శాతం ఫలితాలు సాధించాలి

● సబ్జెక్టు టీచర్లకు సెలవులు బంద్ : ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా

ఉట్నూర్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఈనెల 21 నుంచి ప్రారంభంకానున్న 10వ తరగతి పరీక్షలలో గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణులయ్యేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా అన్నారు. శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న పీఎంఆర్‌సీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆమె పదవ తరగతి విద్యార్థుల పరిస్థితులను సమీక్షించారు. విద్యార్థులు పరీక్ష సాఫీగా రాసేలా చూడాలని ఐటీడీఏ పీవో ఈ సందర్భంగా పేర్కొన్నారు. అదేవిధంగా రాబోయే 20 రోజులు సబ్జెక్టు ఉపాధ్యాయులకు సెలవులు ఇవ్వరాదని హెచ్ఎంలకు సూచించారు. సూపర్‌విజన్ డ్యూటీ క్రమంతప్పకుండా నిర్వహించాలని, పర్యవేక్షణకు అధికారులు వచ్చే సమయంలో హాజరు లేని వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులను ఎస్‌ఏ1, ఎస్సీ 2, గ్రాండ్ టెస్టు, ప్రీ ఫైనల్ పరీక్షల ఆధారంగా ఫలితాలను సమీక్షించారు. డీ, ఈ గ్రేడ్లలో ఉన్న వారిపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని ఆదేశించారు. ప్రతీరోజు ఇద్దరు సబ్జెక్టు టీచర్లు సూపర్‌విజన్ డ్యూటీ విధుల్లో తప్పకుండా ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ డీడీలు రమాదేవి, అంబాజీ, గురుకులాల రీజినల్ కో ఆర్డినేటర్ ఆగస్టీన్, నాలుగు జిల్లాల ఏటీడీవోలు, ఏసీఎంవోలు, జీసీడీవోలు, జిల్లా క్రీడల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలి'

ఆదిలాబాద్ రూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అతిక్ బేగం ఆదేశానుసారం సిబ్బంది శనివారం అడ్మిషన్స్ క్యాంపెయిన్ నిర్వహించారు. 2025-2026 విద్యా సంవత్సరంలో భాగంగా ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు కొనసాగుతున్న నేపథ్యంలో కళాశాల సిబ్బంది ఆయా పరీక్షా కేంద్రాల వద్దకు వెళ్లి అధ్యాపకులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని విద్యార్థులను కోరారు.

నిధుల మంజూరు పట్ల హర్షం

బోథ్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నాయీ బ్రాహ్మణ సంఘ భవన నిర్మాణానికి మాజీ ఎంపీ సోయం బాపురావు గతంలో రూ.3 లక్షలు మంజూరు చేశారు. అయితే భవన నిర్మాణానికి ముందుండి నిధులు మంజూరు చేయించిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.రాజు యాదవ్‌కు రుణపడి ఉంటామని సంఘం సభ్యులు పేర్కొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి చేయాలి

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఉట్నూర్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎన్నికైన ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతుల సంక్షేమానికి కృషి చేయాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతనంగా నియామకమైన ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజలు రైతుల సమస్యలను తెలుసుకుంటు ఆ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ సముచిత స్థానాన్ని కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గం,తదితరులు పాల్గొన్నారు.

అలాగే, మండలంలోని శంకర్‌తండా నివాసి ఐటీడీఏ ఏపీవో జనరల్ జాదవ్ వసంత్‌రావు తండ్రి నారాయణ్‌జాదవ్ అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

'అభివృద్ధి చూసి ఓర్వలేకనే విమర్శలు'

తలమడుగు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పనులనుఉ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని దేవాపూర్ గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులను నుంచి మంజూరైన రూ.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, మురికి కాలువల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఇందులో మాజీ జడ్పీటీసీలు గోక గణేష్ రెడ్డి, బి.బాబన్న, మాజీ ఎంపీపీ కల్యాణం లక్ష్మిరాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ వెంకన్న యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులున్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

బీంపూర్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిప్పల్‌కోటిలో శనివారం కబరస్తాన్‌కు వెళ్లేందుకు రూ.3 లక్షల విలువ గల సీసీ రోడ్డు నిర్మాణానికి పీఏసీఎస్ డైరెక్టర్ దాసరి రమేష్ గ్రామస్థులతో కలిసి భూమిపూజ చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని గుర్తు చేశారు. ఇందులో కల్లెం శ్రీనివాస్‌రెడ్డి, షేక్ నసురుద్దీన్, రెండ్ల గోవర్ధన్, షేక్ అఫ్రోజ్, షేక్ పీర్ మహ్మద్, షేక్ హైదర్, అల్లబకష్, తదితరులు ఉన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

● డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజ రెడ్డి

బీంపూర్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తామని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజ రెడ్డి అన్నారు. ఆయన శనివారం మండల కేంద్రంలో ఆదిలాబాద్‌తో కలిసి 57 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఇందులో తహసీల్దార్ నలంద ప్రియ, మాజీ ఎంపీపీ కుడి మేత సంతోష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కామన్ అశోక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేకల నాగయ్య, నాయకులు కొడిమెల దేవ రెడ్డి, గుర్ర నరేందర్ యాదవ్, చిలుకూరి సంజీవ్ రెడ్డి, మడావి లింబాజీ, కేమ గంగయ్య, సయ్యద్ బాబర్, బక్కి కపిల్, మేకల ప్రవీణ్,షేక్ అఫ్రోజ్, బొంత నితిన్, సుదర్శన్, నరేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

తాంసి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాలకు మంజూరైన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను శనివారం సాయంత్రం డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ కల్యాణలక్ష్మితో ఆడబిడ్డ కష్టంలో కొంత ప్రభుత్వం సహాయపడుతుందన్నారు. లబ్ధిదారులు ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం మహిళలకు ప్రత్యేక పథకాలను ప్రవేశపెడుతోందని అన్నారు. ప్రతీ మహిళ స్వతహాగా అభివృద్ధి చెందాలన్నారు. మహిళలు అభివృద్ధి చెందినప్పుడే కుటుంబంతో పాటు సమాజం అభివృద్ధి చెందుతున్న విషయాన్ని గమనించాలని కోరారు. ఈ సందర్భంగా 35 మంది లబ్ధిదారులకు ఈ చెక్కులను అందజేశారు.


తలమడుగు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్


తాంసి పోలీస్‌స్టేషన్‌లో పరిసరాలను పరిశీలిస్తూ..

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

● ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

తలమడుగు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా మహారాష్ట్ర సరిహద్దులో ఉన్నందున అసాంఘిక కార్యకలాపాలకు ఎలాంటి ఆస్కారం ఇవ్వకుండా పూర్తిగా రూపుమాపాలని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శనివారం తలమడుగు పోలీస్ స్టేషన్‌ను సందర్శించి ఎస్సై సిబ్బందికి సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు నిర్వహిస్తూ వాటిని అరికట్టాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ వచ్చే ఫిర్యాదుదారులను గౌరవంగా వ్యవహరిస్తూ రిసెప్షన్ సెంటర్ నందు ప్రతీఒక్క ఫిర్యాదుని నమోదు చేసుకొని బాధితులకు సత్వర పరిష్కారం అందించే దిశగా కృషి చేయాలని తెలిపారు. పోలీస్‌స్టేషన్ ఆవరణ పరిశుభ్రతను కలిగి ఉంచుకోవాలని తెలిపారు. వచ్చే ఫిర్యాదుదారులకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌లు జిల్లా ఎస్పీకి పూలమొక్కలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించి ఎస్పీ పోలీస్ స్టేషన్‌లో మొక్కలు నాటారు. కోర్టు డ్యూటీ విధులను ఎస్సైలు నిరంతరం పర్యవేక్షిస్తూ కేసుల నందు శిక్షలు పడేవిధంగా కృషి చేయాలని తెలిపారు. నేరస్థులకు శిక్షలు పడినప్పుడే జిల్లాలో జరిగే నేరాల సంఖ్య తగ్గుముఖం పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, ఆదిలాబాద్ గ్రామీణ సీఐ కె ఫణిదర్, ఎస్సైలు డికె రాధిక, అంజమ్మ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● తాంసిలో పోలీస్‌స్టేషన్ తనిఖీ

తాంసి: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం తనిఖీ చేశారు. ముందుగా ఎస్పీకి డీఎస్పీ జీవన్‌రెడ్డితో పాటు సీఐ ఫణీందర్‌లు స్వాగతం పలికారు. సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పోలీస్ క్వార్టర్స్‌ను పరిశీలించారు. అదేవిధంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. రికార్డులు, రిసెప్షన్, లాకప్, మెస్‌బ్యారక్, టెక్నికల్‌రూం, పరిసరాలను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వారి విధులకు సంబంధించిన సూచనలు చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎస్సై రాధికకు పలు సూచనలు చేశారు. ఎల్లవేళలా ఫిర్యాదులు స్వీకరించడం, బాధితుల ఫిర్యాదుపై సత్వరం స్పందించి సేవలు అందించాలని చెప్పారు. సీసీ కెమెరాల ఆవశ్యకత విధిగా ప్రజలను చైతన్య పర్చాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. ఆయన వెంట డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, సీఐ ఫణీందర్, తదితరులు ఉన్నారు.

ఘనంగా కాన్షీరామ్ జయంతి

ఇంద్రవెల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ భవనంలో శనివారం కాన్షీరామ్ 90వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీఎస్పీ మండల అధ్యక్షుడు పెందూర్ అంకుష్ ఆధ్వర్యంలో కేజీబీవీ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలను పంపిణీ చేశారు. ఇందులో బాబాసాహెబ్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోనకాంబ్లే మనోహర్, ప్రధాన కార్యదర్శి వాగ్మారే కామరాజ్, బీఎస్పీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు వావలకర్ శివాజీ, దళిత సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: అట్టడుగు వర్గాల ప్రజలు రాజకీయపరంగా ఎదిగితే ఆయా వర్గాల ప్రజలు అన్ని రంగాల్లో ముందుకు వచ్చే ఆస్కారం ఉందన్న కాంక్షతో దళ్త సమాజ పార్టీని స్థాపించడం జరిగిందని ఆ పార్టీ మండల నాయకులు రమేష్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో కాన్షీరామ్ 91వ జయంతి వేడుకలను జరుపుకున్నారు. ఇందులో పార్టీ నాయకులు సాగర్, ఆటో యూనియన్ నాయకులు సాగర్, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోలను తనిఖీ చేసిన పోలీసులు

బోథ్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలువురు ఆటో డ్రైవర్ల లైసెన్సు, ఇన్సూరెన్స్ వంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా ఆటోలు నడుపుతున్నారు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో నష్టపోయిన వారికి పరిహారం అందుకుండా పోతోంది. దీంతో ఎస్సై ప్రవీణ్ శనివారం ఉదయం బస్టాండ్‌లో ఆటోలో తనిఖీ చేశారు. అంతేగాక ఆటోలలో ముందు డ్రైవర్ల పక్కన ఉన్న సీట్లను తొలగించారు. మరోవైపు ఆటోల మధ్యలో ఉన్న మిర్రర్లను తొలగించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులు తీసుకు వెళ్లవద్దని సూచించారు.

ఆదిలాబాద్‌లో అర్ధరాత్రి కత్తిపోట్ల కలకలం

● గూడరాంపూర్‌లో ఇద్దరిపై అర్ధరాత్రి దాడి

జైనథ్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా బోరజ్ మండలం గూడరాంపూర్ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి మద్యం తాగిన మైకంలో ఇద్దరిపై ఓ యువకుడు కత్తితో దాడి చేసిన ఘటన కలకలం రేపింది. జైనథ్ రూరల్ సీఐ సాయినాథ్ కథనం ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన విష్ణు శుక్రవారం అర్ధరాత్రి మద్యం తాగేందుకు తన బైక్‌పై గూడరాంపూర్‌కు వెళ్లాడు. ఆ గ్రామంలో విష్ణు బైక్‌పై గూడరాంపూర్‌కు చెందిన ఆజయ్ చెయ్యిపెట్టగా.. తన వాహనంపై ఎందుకు చెయ్యి పెట్టావని అతనితో విష్ణు వాగ్వాదానికి దిగాడు. మాట మాట పెరగడంతో విష్ణు.. తన వద్ద ఉన్న కత్తితో అజయ్ కడుపులో పొడిచాడు. అడ్డువచ్చిన అదే గ్రామానికి చెందిన ఆశోక్‌పై కూడా కత్తితో విష్ణు దాడి చేశాడు. గాయాలు పాలైన ఇద్దరిని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అజయ్ పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు ఈ సందర్భంగా తెలిపారు. కాగా.. శనివారం విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్‌.జీవన్‌రెడ్డి, జైనథ్ రూరల్ సీఐ సాయినాథ్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. సంఘటనకు గల కారణాలను అజయ్‌ని అడిగి తెలుసుకున్నారు.

ఆర్థిక నేరాలపై విద్యార్థులకు అవగాహన

ఉట్నూర్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సి డిగ్రీ కాలేజ్, గురుకుల బాలికల గిరిజన సంక్షేమ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆర్థిక నేరాలపై అవగాహన కల్పించారు.

సర్కారు బడుల్లో.. ఏఐ పాఠాలు

(3వ పేజీ తరువాయి...)

వెనుకబాటుకు గురవుతున్నారు. వీరి కోసం ఇప్పటికే పలు రకాల కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతున్నా ఆశించిన ఫలితం రావడం లేదన్నారు. దీంతో కృత్రిమ మేధా సహాయంతో విద్యార్థుల్లో మెరుగైన సామర్థ్యాలను సాధించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

ఏఐకి సిగ్నల్ కష్టాలు

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఏఐ బోధనకు సిగ్నల్ కష్టాలు ఎదురవుతున్నాయి. కొన్ని పాఠశాలల్లో నెట్‌వర్క్ ఇబ్బందులు తలెత్తే అవకాశం కనిపిస్తోంది. దీంతో ఆన్‌లైన్ తరగతులకు అంతరాయం ఏర్పడనుంది. ఆన్‌లైన్ నెట్‌వర్క్ సేవలు అందకపోతే తరగతులు నిలిచిపోయే అవకాశం ఉంది. అయితే తొలిదశలో దేవాపూర్ ప్రాథమిక పాఠశాలలో నెట్‌వర్క్ ఇబ్బందులు తలెత్తాయి. దీంతో నో సిగ్నల్ అని చూపడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో ఏఐ ద్వారా పాఠాలు బోధించేందుకు మొత్తం 8 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో తలమడుగు మండలం దేవాపూర్ ప్రాథమిక పాఠశాల, ఉర్దూ ప్రాథమిక పాఠశాల, భోరజ్ ప్రాథమిక పాఠశాల, ఆదిలాబాద్ అర్బన్ మండలంలో తాటిగూడ ప్రాథమిక పాఠశాల, రణదివ్య నగర్ ప్రాథమిక పాఠశాల, జైనథ్ మండలంలో పిప్పర్‌వాడ ప్రాథమిక పాఠశాల, బాలాపూర్ ప్రాథమిక పాఠశాల, ఆడ ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేశారు. మొదటి దశలో శనివారం నుంచి నాలుగు పాఠశాలల్లో ఏఐ ద్వారా ఆన్‌లైన్ బోధనను ప్రారంభించారు. సోమవారం నుంచి మరో నాలుగు పాఠశాలల్లో ఏఐ ద్వారా పాఠాల బోధన చేపట్టనున్నారు. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో అవసరమైన ఏర్పాట్లను చేశారు. కంప్యూటర్ సిస్టమ్ అందుబాటులో ఉన్న ప్రాథమిక పాఠశాలలను గుర్తించి ఎంపిక చేశారు.

తాగిన మైకంలో ఒకరి ఆత్మహత్య

ఇంద్రవెల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగిన మైకంలో ఒకరి మృతి చెందిన ఘటన మండలంలోని బుర్సన్‌పటర్ గ్రామంలో జరిగింది. కుటుంబీకులు, ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. బుర్సన్‌పటర్ గ్రామానికి చెందిన సోన్ కాంబ్లే విద్యాసాగర్(57) వ్యవసాయ పనులతో పాటు కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శుక్రవారం హోలీ సంబరాల్లో భాగంగా అతిగా మద్యం తాగాడు. సాయంత్రం వ్యవసాయ పనులకు వెళ్లిన విద్యాసాగర్ తాగిన మైకంలో పంట చేనులో ఉన్న గుర్తుతెలియని పురుగుల మందు తాగి స్పృహ కోల్పోయాడు. గమనించిన స్థానికులు వెంటనే కుటుంబీకులకు సమాచారం అందించి 108 అంబులెన్స్‌తో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా.. చికిత్సలు పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు రిమ్స్ ఆసుపత్రికి సందర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతుడి కొడుకు సోన్ కాంబ్లే కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి పోస్టుమార్టమ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పండగ పూట బుర్సన్‌పటర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఉరివేసుకుని ఒకరి బలవన్మరణం

ఇచ్చోడ/బజార్‌హత్నూర్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంనగర్ గ్రామానికి చెందిన గేడం గంగారాం మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు బజార్‌హత్నూర్ ఎస్సై తెలిపారు. ఈ మేరకు కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని శనివారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. స్థానిక డీఈవో కార్యాలయ సమీపంలో ఆటో, యాక్టివా ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో గాయాలైన వారిని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో యాక్టివాపై ప్రయాణిస్తున్న ఇద్దరు 15 ఏళ్ల బాలులతో పాటు మరో వ్యక్తి శ్రీనివాస్‌కు సైతం గాయాలయ్యాయి.

సత్ఫలితాలిస్తున్న 'పోలీసుఅక్క'

● నిర్మల్ జిల్లాలోని పోలీసుస్టేషన్ల పరిధిలో పలు విధులను విజయవంతం చేస్తున్న మహిళా పోలీసులు ● శనివారం మండలంలో పోలీసు అక్కల విస్తృత తనిఖీలు ● పెట్రోలింగ్ సహా వాహనాల తనిఖీ, 100 డయల్, హెల్మెట్‌పై అవగాహన ● విభాగాల్లో ముమ్మర సేవలు


ఖానాపూర్‌లో పెట్రోకార్ విధులను నిర్వహిస్తున్న పోలీసు అక్కలు


వాహనాలు తనిఖీ చేస్తున్న దృశ్యం

ఖానాపూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలో ఎస్పీ జానకి షర్మిల ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన 'పోలీస్ అక్క' కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోంది. విధి నిర్వహణలో పురుషులతో సమానంగా తాము పని చేయగలమని మహిళా పోలీసులు నిరూపిస్తున్నారు. ఇన్నాళ్లు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించే విధులకు మాత్రమే పరిమితమైన మహిళా పోలీసులు జిల్లా ఎస్పీ తీసుకున్న విప్లవాత్మక నిర్ణయంతో ప్రజలతో నేరుగా సత్సంబంధాలు ఉన్న ఆయా విభాగాల్లో విధులు నిర్వహిస్తూ బెరా అనిపిస్తున్నారు. శనివారం ఖానాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీస్ అక్కలు పలు విభాగాల్లో విజయవంతంగా విధులు నిర్వహించి ఉన్నతాధికారులు సహా పలువురి మన్ననలు పొందారు. ఏఎస్పీ పరిధిలోకి వచ్చే ఖానాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళా కానిస్టేబుళ్లు విధులు నిర్వహిస్తున్న మల్లేశ్వరి, గ్రావణి, అనే ఇద్దరు పోలీస్ అక్కలు మండలంలో ముమ్మరంగా పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ప్రధాన కాలనీలతో పాటు బాదనకుర్తి, తర్లపాడ్ గ్రామాల్లో హెల్మెట్ వినియోగంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. అంతేకాకుండా పెట్రోకార్ విధులను నిర్వహిస్తూ వాహనాల తనిఖీలను చేశారు. ఇలా విధి నిర్వహణలో ప్రజలతో మరింత మమేకమవ్వాలా పోలీస్ అక్క కార్యక్రమం నిర్మల్ జిల్లాలో సత్ఫలితాలను ఇస్తోందని జిల్లా పోలీస్ శాఖతో సహా బయట సమాజంలోని పలువురు సామాన్యులు సైతం ఈ కార్యక్రమాన్ని కొనియాడుతున్నారు.



మహిళలు అన్నిట్లో తక్కువ కాకుండా ఎలాంటి డ్యూటీ అయిన మగవారితో సమానంగా చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మహిళా పోలీసులను జిల్లా ఎస్పీ జానకి షర్మిల అభినందించారు.

నారీ శక్తిలో భాగంగా విధుల్లోకి మహిళా సిబ్బంది

కడెం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు నారీ శక్తి కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్మల్ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో మహిళా సిబ్బంది బ్లూ కోర్ట్, పెట్రోకార్ విధులు నిర్వహిస్తున్నారు. నారీ శక్తి కార్యక్రమంలో భాగంగా కడెం మహిళా సిబ్బందికి పెట్రోకార్, బ్లూ కోర్టు విధులను కేటాయించినట్లు కడెం ఎస్సై ఎం. కృష్ణసాగర్ రెడ్డి తెలిపారు.

బ్లూ కోర్టు విధుల్లో మహిళా కానిస్టేబుళ్లు

దస్తురాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : నారీ శక్తి కార్యక్రమంలో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లోని మహిళా కానిస్టేబుళ్లు కే. రంజిత, ఎ. కళ్యాణి శనివారం మండల కేంద్రంలో బ్లూ కోర్టు విధులు విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా 100 డయల్ విధులు నిర్వర్తించారు. అనంతరం వాహనాలను తనిఖీ చేసి, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వారికి జరిమానా విధించారు.

ముథోల్‌లో..

ముథోల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీ ఆదేశాలకు అనుగుణంగా మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని నారీ శక్తి కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలో మహిళా పోలీసులు బ్లూ కోర్టు తదితర విధులను నిర్వహించారు. రిసెప్షన్ డ్యూటీలతోనే కాకుండా పెట్రోలింగ్, బ్లూ కోర్టు, పాత నేరస్థుల తనిఖీ తదితర విధులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీడబ్ల్యూసీ రాజమణి, ఆశు, తదితరులు పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేసిన మహిళా పోలీసులు

నిర్మల్ రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : నారీ శక్తి కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని గండి రామన్న సాయిబాబా ఆలయం సమీపంలో మహిళా పోలీసులు వాహనాలు తనిఖీ చేసి డ్రంగ్ అండ్ డ్రైవ్, ఈ చలాన్స్ విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ..




వాహనాలను తనిఖీ చేస్తున్న మహిళా కానిస్టేబుల్

నిర్మల్ జిల్లాలో కాన్షీరాం జయంతి


కాన్షీరాంకు నివాళులర్పిస్తున్న నాయకులు


మాట్లాడుతున్న అడ్వకేట్ జగన్‌మోహన్

నిర్మల్ కల్చరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా కేంద్రంలో బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ కాన్షీరాం 91వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. బీఎస్పీ నాయకుల ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్ దర్యాసాగర్ చెరువు వద్ద ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కృషి వల్ల ఉత్తరప్రదేశ్‌లో 1995లో బహుజన సమాజ్ పార్టీ అధికారంలోకి వచ్చిందని నాయకులు అన్నారు. బహుజనుల కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు కాన్షీరాం అని కొనియాడారు. రాష్ట్ర నాయకులు నిగిలపు లింగన్న, పడిగెల రాజేష్, ఎస్. ప్రభాకర్, లక్ష్మణ్, కత్తి విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

బహుజనులకు రాజ్యాధికారమే అంతిమ లక్ష్యం

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : బహుజనులకు రాజ్యాధికారమే అంతిమ లక్ష్యమని బీఎస్పీ నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి జగన్‌మోహన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు దివంగత నేత కాన్షీరాం 91వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్ మాట్లాడుతూ.. మహనీయులైన ఛత్రపతి మహారాజ్, మహాత్మా జ్యోతిబాపూలే, నారాయణ గురు, పెరియార్ రామస్వామి నాయకర్, డా. అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చిన యోధుడు కాన్షీరాం అని అన్నారు. రాజ్యాధికారమే అంతిమలక్ష్యం అని నిరూపించిన సోషల్ ఇంజినీరింగ్ రాజనీతిజ్ఞుడు కాన్షీరాం అని ఆయన సేవలను కొనియాడారు. దేశంలో ఎక్కువ జనాభా ఉన్న బీసీలకు ఒక రాజకీయ పార్టీ ఉండాలని బహుజన సమాజ్‌పార్టీ పెట్టారన్నారు. డా.అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించిన ఓటు హక్కుతో రాజ్యాధికారం రుచి చూపించి, రాజ్యాధికారం సాధించారన్నారు. నేటికి కాన్షీరాం ఆలోచనలు అనుసరణీయమని, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని అన్ని సమస్యలకు పరిష్కారం అని తెలిపారని ఆ రథాన్ని రాజ్యాధికారం వైపుగా నడిపించిన మహనీయుడు కాన్షీరాం అన్నారు. నేడు బహుజనులు బానిసత్వాన్ని పోగొట్టాలంటే రాజ్యాధికారం కోసం పోరాడాలని, ఈ ఆశయాల సాధనకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మారి రాజన్న, జిల్లా ఇన్‌చార్జి రాజన్న, జిల్లా మహిళా కన్వీనర్ లక్ష్మీదేవి, జిల్లా నాయకులు ముత్యం, నాయకులు కొండాపూర్ ముత్యం, ఇతరులు పాల్గొన్నారు.

కాన్షీరాంకు ధర్మ సమాజ్ పార్టీ నివాళులు

నిర్మల్ కల్చరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : బీఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ కాన్షీరాం జయంతి సందర్భంగా ధర్మసమాజ్ పార్టీ నాయకులు శనివారం ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ట్యాంక్ బండ్ వద్ద జరిగిన కార్యక్రమంలో సభ్యులు కల్లూరు సుధాకర్ రాజు, కుందూరు వినోద్, శేఖర్, ప్రవీణ్ పాల్గొన్నారు. అంబేద్కర్ ఆశయాలు కొనసాగించిన మహోన్నత నాయకుడు కాన్షీరాం అని కొనియాడారు.


నివాళులర్పిస్తున్న ధర్మ సమాజ్ పార్టీ

పద్యకవి వెంకట్‌కు డాక్టర్ ఆఫ్ తెలుగు లిటరేషన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న పద్యకవి వెంకట్

ముథోల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ పద్యకవి, వ్యాఖ్యాత, ఉపన్యాసకులు, సంస్కృత భాష ప్రచార సమితి ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల పూర్వ స్థాపక అధ్యక్షులు బి. వెంకట్ ఫ్రెండ్షిప్ మినిస్ట్రీస్ సంస్థ, ఇందిర ఆర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ ఆఫ్ తెలుగు లిటరేషన్ అవార్డు 2025 లభించింది. శనివారం హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో గల సారెగ స్టూడియోలో జరిగిన సినీ సంగీత విభావరి, కవి సమ్మేళనము ఆవార్డుల ప్రదానోత్సవములో డాక్టర్ ఆఫ్ తెలుగు లిటరేషన్ అవార్డు 2025ను ఫ్రెండ్షిప్ మిని స్ట్రీస్ చైర్మన్ డా. అలూరి విల్సన్ ప్రముఖ సినీనటులు పసునూరి శ్రీనివాస్, సిటీ సివిల్ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ డా. పీవీపీ ఆంజనీ కుమారి, స్పెషల్ పోలీస్ ఆఫీసర్, సినీ సింగర్ ప్రేమారెడ్డి, ఇందిర ఆర్ట్స్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, మెలోడీ, రొమాంటిక్ సింగర్ డాఎన్. ఇందిర చేతుల మీదుగా అందుకున్నారు. ఇదే వేదికపై అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా జరిగిన కవి సమ్మేళనములో 'నేటి సమాజానికి ఆదర్శ మహిళలు' అన్న శీర్షికపై రాగయుక్తంగా తెలుగు పద్యాలను ఆలపించారు. సాహితీ పద్యాలావని అవార్డులను స్వీకరించారు. వివిధ తెలుగు సాహిత్య సేవలకు గుర్తింపు డాక్టరేట్ అవార్డు వచ్చినట్లు వెంకట్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బుడిగె సాహితీ, కేంద్ర తరంగిణి, వేముల రాధారాణి, కామంచి శారద, కే. సుధారాణి, ఎం. భాగ్యశ్రీ, పి. లక్ష్మీప్రసన్న, ఏ. లావణ్య పటేల్ పాల్గొన్నారు.

'ఆంధ్రజ్యోతి' కథనంపై కదిలిన యంత్రాంగం

● కలెక్టర్ సీరియస్‌తో స్పందించిన డీఎంఅండ్‌హెచ్‌వో ● రిజర్వేషన్ రోస్టర్‌పై చర్యలకు నిర్ణయం

నిర్మల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : రిజర్వేషన్ రోస్టర్ దాచి... రూ. కోటి దాచే ప్లాన్ శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం వైద్య, ఆరోగ్య శాఖ వర్గాల్లో తీవ్ర కలకలం సృష్టించింది. ఇటీవలి కాలంలో జాతీయ ఆరోగ్య మిషన్ కింద పలు ఉద్యోగాల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్లు వెలువడ్డాయి. నోటిఫికేషన్లు విడుదల చేసినప్పటికీ రిజర్వేషన్ రోస్టర్ జాబితాను నిర్మల్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు డిస్‌ప్లే చేయలేదు. కొందరికి మెరిట్ ఆధారంగా సెలక్షన్ వచ్చినప్పటికీ రిజర్వేషన్ రోస్టర్ తెలియక జిల్లా కార్యాలయంలో పని చేస్తున్న కొందరు దళారులకు డబ్బులు ఇచ్చినట్లు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అమాయకులైన అభ్యర్థులను మోసం చేసిన తీరును ఎండగడుతూ ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది. దీనిపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తీవ్రంగా స్పందించారు. ఉద్యోగాలకు సంబంధించిన అన్ని ఫైళ్లను తీసుకురావాలని ఆదేశించారు. రిజర్వేషన్ రోస్టర్ ప్రకటించకపోవడంపై ఆమె తీవ్రంగా అధికారులను మందలించినట్లు తెలిసింది. ఈ మేరకు జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజేందర్ స్పందించారు. నియామక ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. అభ్యర్థులు ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. ఈ మేరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. తక్షణమే జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయంలో రిజర్వేషన్ రోస్టర్ జాబితాలను తాజాగా శనివారం ప్రదర్శించడం గమనార్హం. దీనిపై నిరుద్యోగ అభ్యర్థులు సంతోషం వ్యక్తం చేస్తూ ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.



ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం
కథనానికి స్పందిస్తూ విడుదల చేసిన ఉత్తర్వులు

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

నేరడిగొండ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పరిసరాల, వ్యక్తిగత శుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్ అన్నారు. శనివారం మండలంలోని బుగ్గారం గ్రామంలో గల గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ బాలికల కళాశాలలో సీటీపీ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా 69 మంది విద్యార్థినులకు రక్త నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి కాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు తినే ముందు, తరువాత చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా బయటకు తిరగవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ల్యాబ్ టెక్నీషియన్ ఉత్తమ్‌సింగ్, హెల్త్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డి, జీఎన్ఎం అనితలు హాజరయ్యారు.


విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

జూనియర్ కాలేజీలకు కొత్త లెక్చరర్లు

● జిల్లాకు 42 మంది కేటాయింపు ● తీరనున్న బోధన తిప్పలు

భైంసా, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) ; ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు కొత్త లెక్చరర్లు వచ్చారు. 13 ఏళ్లుగా పూర్తి స్థాయిలో లెక్చరర్లు లేక కాలేజీల్లో బోధన అంతంత మాత్రంగా సాగుతోంది. బుధవారం సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కొత్త 1297మంది లెక్చరర్లు నియామకపత్రాలు అందుకున్నారు. వీరిలో నిర్మల్ జిల్లాకు కొత్తగా 42 మంది లెక్చరర్లను కేటాయించారు. ఇందులో 39 మంది లెక్చరర్లు నియామకం ద్వారా కేటాయించబడగా మిగతా ముగ్గురు ఆన్ డ్యూటీ ప్రతిపాదికన ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి కేటాయించబడ్డారు. నియామకపు పత్రాలు అందుకున్న పలువురు లెక్చరర్లు తమకు కేటాయించిన కళాశాల విధుల్లో చేరారు.



భైంసా ప్రభుత్వ జూనియర్ కళాశాల

● పదోన్నతులతో సరి..

ఏళ్ల తరబడి సర్కార్ లెక్చరర్ల నియామకాలను చేపట్టలేదు. అయితే 2014, 2016, 2019, 2021లో పదోన్నతులు కల్పించారు. గత బీఆర్ఎస్ సర్కార్ కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేసింది. వీరితో పాటు కొందరు కాంట్రాక్టు, గెస్ట్ లెక్చరర్లతో బోధన సాగుతోంది. దాంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం కొత్త నియామకాలు చేపట్టడంతో జిల్లాకు 42 మంది కొత్త లెక్చరర్లు రానున్నారు. దాంతో లెక్చరర్ల కొరత తీరనుంది.అంతేకాకుండా బోధన తిప్పలు సైతం దూరం కానున్నాయి. విద్యా బోధన వ్యవస్థ పూర్తి స్థాయిలో మెరుగుకానుంది.


విధుల్లో చేరుతున్న కొత్త అధ్యాపకులు

● జిల్లాలో ఇలా..

నిర్మల్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలుండగా.. దాదాపు 6వేల మంది విద్యార్థులు ఉన్నారు. కొత్తగా నియమితులైన వారిలో జిల్లాకు 42 మంది లెక్చరర్లు కేటాయించబడ్డారు. వీరిలో 12 మంది ఉర్దూ మీడియం కళాశాలలకు కేటాయించగా మిగతా 29 మంది తెలుగు, ఇంగ్లీష్ మీడియం కళాశాలలకు కేటాయించారు. కళాశాలల వారీగా చూస్తే కొత్త నియమితులైన లెక్చరర్లలో నిర్మల్ బాలుర జూనియర్ కళాశాలకు 10 మంది, బాలికల కళాశాలకు ఆరుగురు, తానూర్ కళాశాలకు ముగ్గురు, కుంటాల కళాశాలకు ఇద్దరు, ముథోల్ కళాశాలకు 5 గురు, సారంగపూర్ కళాశాలకు ఇద్దరు, కుభీర్ కళాశాలకు ముగ్గురు, కడెం కళాశాలకు ఇద్దరు, భైంసా కళాశాలకు ఆరుగురు, ఖానాపూర్ కళాశాలకు ఇద్దరు, దిలావర్‌పూర్, లోకేశ్వరం, మామడ జూనియర్ కళాశాలలకు ఒక్కొక్కరు చొప్పున లెక్చరర్లు కేటాయించబడ్డారు.

మండుతున్న ఎండలు

● నీటిలో సేద తీరుతున్న మూగ జీవాలు


గడ్డెన్నవాగు ప్రాజెక్టు నీటి ప్రవాహంలో సేద తీరుతున్న మూగజీవాలు

భైంసా, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎండల దాటికి మూగజీవాలు విలవిలలాడి పోతున్నాయి. ప్రధానంగా మధ్యాహ్నం వేళలో ఎండ తీవ్రతతో సతమతమవుతునాన్నాయి. మేతకోసం వెళ్లిన మూగజీవాలు మధ్యాహ్నం వేళల్లో అక్కడి ప్రాంతంలోని చెట్ల కింద సేదతీరుతున్నాయి. నీటి నిల్వలున్న ప్రాంతాలు కనిపిస్తే వెంటనే వాటిల్లోకి వెళ్లి చల్లదనం పొందుతున్నాయి. ఇదే తరహాలో ఆదివారం భైంసా పట్టణ ప్రాంతానికి చెందిన మూగజీవాలు మధ్యాహ్నం వేళలో గడ్డెన్న వాగు ప్రాజెక్టు ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న నీటిలో సేద తీరుతూ కనిపించాయి. అక్కడి ప్రాంతంలో మేతకు వెళ్లిన మూగజీవాలు మధ్యాహ్నం వేళలో పరుగుపరుగున కాలువలో దిగి ప్రవహించే నీటిలో సేదతీరుతున్న సందర్భంలో ఆంధ్రజ్యోతి తమ కెమెరాలో బంధించిన దృశ్యమే పై ఫోటో.

భానుడి భగభగలు

● ఆదిలాబాద్ రూరల్ మండలంలో 40.8 గరిష్ట ఉష్ణోగ్రత

ఆదిలాబాద్, మార్చి15 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో భానుడి భగభగలకు పగటి ఉష్ణోగ్రతలు అమాంతంగా పెరిగి పోతున్నాయి. గత రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా 40 డిగ్రీలకు పైగానే పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శనివారం జిల్లా సగటు గరిష్ట ఉష్ణోగ్రతలు 40.8 కాగా కనిష్ఠంగా 24.2 డిగ్రీలుగా నమోదైంది. అలాగే ఆదిలాబాద్‌రూరల్ మండలం పిప్పల్ ధరిలో అధికంగా 40.8, ఉట్నూర్‌లో 40.7, ఆదిలాబాద్ అర్బన్‌లో 40.6, బేలలో 40.3, బజార్ హత్నూర్‌లో 40.2 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తీవ్రమైన ఎండలతో మిట్టమధ్యాహ్నం జనం బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. అలాగే రైతులు, కూలీలు మధ్యాహ్నం సమయంలో విరామం తీసుకుని కొద్దిసేపు సేద తీరుతున్నారు. ఉదయం సాయంత్రం సమయాల్లోనే వ్యవసాయ పనులను చేపడుతున్నారు. ముఖ్యంగా వీధి వ్యాపారులు ఎండ తీవ్రతకు తాత్కాలిక ఏర్పాట్లను చేసుకుంటున్నారు. ఎండలతో వ్యాపారం పడిపోతుందంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరికొన్నాళ్ల పాటు జిల్లా పై వడగాలుల ప్రభావం ఉండడంతో ఎండల తీవ్రత ఎక్కువగానే ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు.


నిర్మానుష్యంగా మారిన ఆదిలాబాద్‌లోని వినాయక్ చౌక్ రోడ్డు


ఎండ తీవ్రతకు స్కార్ఫ్ ధరించి వెళ్తున్న యువతులు


తహసీల్దార్ కార్యాలయంలో
అధికారుల పేర్లు మార్చని సూచిక బోర్డులు

కార్యాలయ బోర్డుపై బదిలీపై వెళ్లిన అధికారుల పేర్లు

నార్నూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయం అంటేనే నిత్యం ప్రజలు ఏదో ఒక సమస్య పనులు తీసుకొని వస్తుంటారు. ఆ సమయంలో అధికారులతో సంప్రదించడానికి కార్యాలయం బోర్డు సూచికపై తమ పేరు నెంబర్‌ని రాసి పెట్టారు. అలాంటిది గిరిజన ప్రాంతం మండలమైన నార్నూర్ తహసీల్దార్ కార్యాలయం అధికారి ఇబ్బందులు ఇతర మండలాలకు బదిలీ డిప్యూటేషన్‌లపైన వెళ్లిన ఇప్పటికీ వారి పేర్లు నంబర్ లు సూచిక బోర్డ్‌పై ప్రజలకు దర్శనమిస్తున్నాయి. దీన్ని బట్టి చూస్తే కార్యాలయ సిబ్బంది ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిసున్నారు అర్థమవుతుంది. సమాచార హక్కు చట్టం కింద కార్యాలయానికి దరఖాస్తు చేసిన మేము ఎవరిని సంప్రదించాలని ప్రాంత వాసులు చర్చలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్యాలయంలో ఉన్న సూచిక బోర్డులపై తప్పులను సవరించి ఇపుడున్న అధికారుల పేర్లు రాయాలని దళిత గిరిజన ప్రజలు కోరుతున్నారు.

ఎండుతున్న పంటలు.. బోరుబావులకు మరమ్మతులు

● భూగర్భ జలం రైతన్నకు శాపం

బోథ్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఒకప్పుడు పుడమి తల్లిపై పచ్చబొట్టు పెట్టినట్లు కనిపించే పచ్చని పైరులన్నీ ఇప్పుడు ఎండిపోయి కళావిహీనంగా మారిపోయాయి. దీంతో రైతన్న తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చేతికి అందే పంట కళ్లముందే ఎండి పోవడంతో రైతన్న గుండె తరుక్కుపోతున్నది.

● నష్టపోతున్న ఆశతో బోరు బావులు తవ్వకాలు

భూగర్భ జలాలు అడుగంటాయని బోరు బావులు తవ్వితే నష్టపోతారంటూ ప్రభుత్వం ఒకవైపు రైతులను హెచ్చరిస్తున్న మరోవైపు ఆశ చావని రైతులు బోరుబావుల తవ్వకాన్ని యదేచ్ఛగా కొనసాగిస్తు న్నారు. భూగర్భంలో నీటి జాడలు లేకపోవడంతో బోరు వేసిన చుక్క నీరు రాకపోవడంతో రైతులు అప్పుల ఊబిలోకి కూరుకు పోతున్నారు. అసలే ఆర్థిక కష్టాల్లో ఉన్న రైతులు బోరుబావులు తవ్వించి బోరుమంటున్నారు. కళ్లెదుటే ఎండుతున్న పైరును చూసి రైతన్న గుండె తరుక్కుపోతున్నది చేసిన అప్పులు తీరుతాయని అనుకుంటే మరింత అప్పుల్లోకి నెట్టివేయబడుతున్నారు. బోరుబావుల తవ్వకాలకు కట్టడి చేయకపోతే మరి కొంతమంది రైతులు అప్పుల ఊబిలోకి కూరుకు పోయే ఆస్కారం ఉంది.


బోరు బావులకు మరమ్మతులు చేస్తున్న రైతులు(ఫైల్)

● రోజుకు మూడు నుంచి నాలుగు మోటర్ల అమ్మకం.

రైతును విచ్చలవిడిగా బోరు బావుల తవ్వకాలు చేపట్టడంతో వచ్చిరాని భూగర్భ జలాలను వెలుపలికి తీసేందుకు తాపత్రయ పడు తున్నారు. అందులో భాగంగానే భూగర్భ జలాలను వెలికి తీసేందుకు మోటార్లను కొనుగోలు చేస్తున్నారు. అక్కడక్కడ చిన్నచిన్న జలలతో బోరు బావి తవ్వించిన సమయంలో తేమ రావడం వల్ల రైతులు ఆశతో బోరు బావులను పరిశీలిస్తున్నారు. అందుకు అవసరమైన మోటార్లను కొనుగోలు చేస్తున్నారు. గతంలో నెలకు ఒకటి రెండు మోటార్లను అమ్మేవాడినని ప్రస్తుతం ప్రతిరోజు రెండు మూడు విక్రయిస్తున్నానని ఓ మోటారు విక్రయించే వ్యాపారి పేర్కొనడం గమనార్హం.


ఇటీవల తవ్వించిన బోరుబావి

రూ. 20కి పచ్చిగడ్డి కట్ట.. బావురుమంటున్నరైతాంగం


విక్రయించేందుకు ఆటోలో తీసుకవస్తున్న పచ్చి గడ్డికట్టలు

భైంసా, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రైతు రాజ్యంలో అన్నదాత పరిస్థితి రోజురోజుకు అగమ్యగోచరంగా మారుతోంది. మార్కెట్లో వీరి పరిస్థితి అమ్మబోతే అడవి,కొనబోతే కొరవి అన్నచందంగా మారింది. ప్రస్తుతం రైతులు తమ తమ పశుసంతతి గ్రాసాన్ని పెట్టలేకపోతున్నారు. కొనుగోలు చేసి పెడదామంటే వాటి ధర కొండెక్కి కూర్చుంది. ఇక్కడి ప్రాంతంలో పచ్చిగడ్డి రేటు భగ్గుమంటోంది. ఒక్కో పచ్చిగడ్డి కట్ట రూ.20కి వరకు లభ్యమవుతోంది. దీంతో రైతులు బావురుమంటున్నారు. గత సంవత్సరం రూ. 15లకు పచ్చి గడ్డికట్ట లభ్యమయ్యేది. సైజు కూడ మెరుగ్గా ఉండేది. కాని ప్ర స్తుతం గడ్డి కట్ట సైజు తగ్గిపోవడమే కాకుండా రేటు రూ. 5 పెరిగింది. ప్రతికూల పరిస్థితులతో ఆశించిన మేర పంటల దిగుబడులు రాక, సాగుకు చేసిన పెట్టుబడులు సైతం చేతికి అందక అర్థికంగా నష్టపోయిన రైతులు గడ్డిని కొన లేని స్థితికి చేరుకున్నారు. దీంతో వారి పశువులు అర్ధాకలితో అలమటిస్తున్నాయి. పెరిగిన గడ్డి ధరలను నియంత్రించేందుకు అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

నాడు జలకళ.. నేడు వెలవెల


ప్రస్తుతం నీటిధారలు లేక వెలవెలబోతున్న కుంటాల జలపాతం

నేరడిగొండ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కుంటాల జలపాతం ప్రస్తుతం జలధారలు లేక వెలవెల బోతోంది. ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడిన జలపాతం అందాలను వీక్షించేందుకు ఉమ్మడి జిల్లాతోపాటు ఆయా రాష్ట్రాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వ స్తుంటారు. ప్రస్తుతం జలపాతం జలధారలు లేక బోసిపోతోంది. దీంతో పర్యాటకుల తాకిడి తగ్గింది. వేసవిలో కుం టాల జలపాతం పరిసరాల్లో ఉన్న చెట్ల ఆకులు సైతం రాలిపోవాడంతో జలపాతం పరిసరాలు బోసిపోతోంది. జలపాతాన్ని తిలకించేందుకు వచ్చే పర్యాటకులు తగ్గిపోవడంతో జలపాతం బోసిపోతోంది.


జలకళతో కుంటాల జలపాతం (ఫైల్)

సర్వేలకే పరిమితమైన రుయ్యాడి రైల్వే గేట్ అండర్ బ్రిడ్జి నిర్మాణం

● గంటల తరబడి ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు ● రైల్వే శాఖ, రెవెన్యూ అధికారుల సమన్వయ లోపం

తలమడుగు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అదిలాబాద్ జిల్లా తలమడుగు మండల కేంద్రంలోని రుయ్యాడి గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో గల రైల్వే గేట్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణం సర్వేలకే పరిమితమైంది. రైల్వే శాఖ అధికారుల, రెవెన్యూ అధికారుల సమన్వయ లోపం గ్రామీణ ప్రజలకు తప్పని ఇబ్బందులు. రైలు బండి వచ్చిందంటే అరగంట ముందు గేటు వెయ్యడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత ఆరు సంవత్సరాల నుంచి గేటు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం రైల్వే అధికారులు, రెవెన్యూ అధికారులు సర్వే చేయడం, ఉన్నత అధి కారులకు నివేదిక పంపడం తప్ప అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం లేద ని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం రైల్వే అధికారులు నిధులు మంజూరు చేసినప్పటికీ బ్రిడ్జి నిర్మాణం కోసం పనులు ప్రారంభించారు. కాగా బ్రిడ్జి నిర్మాణం కోసం స్థలం గుర్తించక పోవడంతో పనులు మధ్యలోని ఆపేశారు. అడపాదడపా రైల్వే అధికారులు, రెవెన్యూ అధికారులు సర్వే చేయడం తప్ప ఇప్పటి వరకు ఎలాంటి పనులు చేపట్టకపోవడంతో మండల కేంద్రం నుంచి రుయ్యాడి, బరంపూర్, ఆదిలాబాద్, దాదాపు 20 గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు గేటు వద్ద ఉండవలసిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గతంలో తల మడుగు గ్రామానికి చెందిన ప్రజలు తలమడుగు రైల్వే స్టేషన్ సమీపంలో రెండు అండర్ బ్రిడ్జీలు నిర్మించాలని అధికారులకు విన్నవించారు. ఆయన ఎవరు పట్టించుకోలేదు ప్రస్తుతం రైల్వేల రాకపోక సంఖ్య అధికంగా పెర గడంతో 20 నిమిషాలకు రైలు బండ్లు రాకపోకలు సాగించడంతో గేటు వద్దనే వేచి చూడవలసిన పరిస్థితిలో ఏర్పడుతున్నాయి. రుయాడి రైల్వే గేటు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రజా ప్రతినిదులు, జిల్లా అధికారులు ప్రత్యేక చొరవ చూపెట్టాలని పలువురు కోరుతున్నారు. దొర్లి రైల్వే గేట్ వద్ద నిర్మించిన అండర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పినాయని తెలిపారు. ఇకనైనా అధికారులు రుయ్యాడి రైల్వే గేటు వద్ద త్వరగా అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలని మండల వాసులు కోరుతున్నారు.


రుయ్యాడి రైల్వే గేట్ వద్ద అండర్ బ్రిడ్జి పనులు అసంపూర్తిగా ఉన్న దృశ్యం



ప్రసవ మరణాల కట్టడికి యాక్షన్‌ప్లాన్

- జిల్లాలో హై పవర్ కమిటీ ఏర్పాటు
- హై రిస్క్ కేసుల కోసం హెల్ప్ లైన్ ఏర్పాటు
- పౌష్టికాహారంపై ప్రతీ వారం సమీక్ష
- మెటర్నిటీ 11 నెలల్లో వెయ్యికి పైగా నార్మల్ డెలివరీలు
- 35వేల మంది గర్భిణులకు ఓపీ వైద్య సేవలు
- మొదలైన కార్యకలాపాలు

నిర్మల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గర్భస్థ మహిళల మరణాలను అరికట్టేందుకు కలెక్టర్ నేతృత్వంలో యాక్షన్ ప్లాన్ రూపొందించారు. జిల్లాలోని ప్రభుత్వ మెటర్నిటీ ఆసుపత్రులలో గర్భస్థ మహిళల కోసం ఈ ప్రత్యేక యాక్షన్‌ప్లాన్‌ను అమలు చేస్తున్నారు. దీనికి సంబంధించిన కార్యకలాపాలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా కలెక్టర్ హెచ్‌ఓడీతో పాటు వైద్యాధికారులు అలాగే ఈ ఆసుపత్రిలో పని చేస్తున్న సీనియర్ సిబ్బందితో కలిసి హైపవర్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి వారం మెటర్నిటీ ఆసుపత్రిలో జరుగుతున్న నార్మల్, సీజేరియన్ డెవలరీలపై అలాగే గర్భస్థ మహిళలకు అందిస్తున్న సేవలపై సమీక్షించనున్నారు. హైపవర్ కమిటీ ఆధ్వర్యంలో సమస్యలపై కూడా పరిష్కార మార్గాలను కనుగొన్నారు. హై పవర్ కమిటీలకు జిల్లా కలెక్టర్ దిశానిర్దేశం చేయనున్నారు. ప్రసూతి ఆసుపత్రి పరిధిలోని ఏఎన్‌యం, ఆశవర్కర్లతో పాటు ఆసుపత్రి పరిధిలోని పీహెచ్‌సీ, వైద్యులకు హైరిస్క్ గర్భిణీల గుర్తింపు బాధ్యతలను అప్పగించనున్నారు. దీంతో పాటు గర్భస్థ మరణాల నియంత్రణ కోసం చేపట్టాల్సిన చర్యలపై వారానికి కొంత మంది వైద్యులకు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.



కేంద్రంలోని మాతా శిశు సంక్షేమ ఆసుపత్రి సూచిక బోర్డు

హై రిస్క్ గర్భిణుల కోసం హెల్ప్‌లైన్ ఏర్పాటు

హైరిస్క్‌ను ఎదుర్కొంటున్న గర్భిణుల సమస్యల పరిష్కారం కోసం ఇక్కడి మెటర్నిటీ ఆసుపత్రిలో హెల్ప్‌లైన్ డెస్క్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ హెల్ప్‌లైన్ డెస్క్‌లో ప్రత్యేకంగా నలుగురు ఏఎన్‌యంలతో పాటు కొంతమంది సిబ్బందిని నియమించారు. వీరు ఇప్పటికే గుర్తించినబడిన హైరిస్క్‌లో ఉన్న గర్భిణులకు హెల్ప్‌లైన్ ద్వారా ఫోన్ చేసి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. అలాగే వారి సమస్యలకు అనుగుణంగా వైద్యసేవల వివరాలను తెలియజేస్తూ ఆరోగ్య జాగ్రత్తలపై సూచనలు అందించనున్నారు. ఇలా హెల్ప్‌లైన్ ద్వారా తెలుసుకున్న సమస్యలపై అందించిన వైద్య సేవల సూచనలపై ప్రతీనెల ప్రత్యేకంగా సమీక్షించనున్నారు. గర్భిణీ మహిళల్లో గుండె సంబంధిత సమస్యలను గుర్తించినట్లయితే వారికి వెంటనే ఇక్కడి మెటర్నిటీ ఆసుపత్రిలో టుడీ ఏకో వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నారు. దీంతో పాటు పౌష్టికాహారంపై మహిళలకు తగిన సూచనలు అందించనున్నారు.

రికార్డుస్థాయిలో డెలివరీలు

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెటర్నిటీ ఆసుపత్రిలో రికార్డుస్థాయిలో డెలవరీలు జరిగినట్లు ఇక్కడి ఆసుపత్రి ఇన్‌చార్జి తెలిపారు. జనవరి నుంచి ఇప్పటి వరకు మెటర్నిటీ ఆసుపత్రిలో మొత్తం 3276 మంది గర్భిణులకు వైద్యసేవలు అందించారు. వీరిలో నుంచి 1024 మంది గర్భవతులకు సాధారణ ప్రసవాలు చేశారు. కాగా 2250 మంది గర్భిణులకు శస్త్రచికిత్సలతో డెలవరీలు చేశారు. గత 11 నెలల నుంచి 4141 మంది ఇన్‌పెషంట్లకు వైద్య సేవలు అందించగా 35,935 మందికి ఓపీ సేవలు అందించినట్లు డాక్టర్లు చెబుతున్నారు. మెటర్నిటీలో 50 పడకల సౌకర్యం మాత్రమే ఉన్నప్పటికి ఇక్కడి డాక్టర్లు మాత్రం 80 మంది నుంచి 90 మంది పేషంట్లను చేర్చుకుని సేవలు అందిస్తున్నారు. కాగా మెటర్నిటీ ఆసుపత్రిలో ఎక్కువ మంది రోగులకు ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య సేవలు అందిస్తూ ఆ సేవల ద్వారా వచ్చే ఇన్సెంటివ్‌ను ఆసుపత్రి అభివృద్ధి కోసమే వెచ్చిస్తుండడం ప్రశంసలకు కారణమవుతోంది.

24 గంటల పాటు సేవలు అందుబాటులో..

- డాక్టర్ సరోజ, మెటర్నిటీ ఆసుపత్రి ఇన్‌చార్జి, నిర్మల్



ప్రభుత్వ మెటర్నిటీ ఆసుపత్రిలో 24 గంటల పాటు వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా గర్భిణుల ప్రసవాలకు ప్రత్యేకసేవలు అందిస్తున్నాం. రికార్డు స్థాయిలో సాధారణ ప్రసవాలు జరిగే విధంగా కృషిచేస్తున్నాం. తప్పనిసరి శస్త్రచికిత్సలు చేసి డెలవరీలు చేస్తున్నాం. గర్భిణీ మహిళలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. నార్మల్ డెలవరీలకే మొదటి ప్రాధాన్యతనిస్తున్నాం. గర్భిణుల కోసం అవసరమయ్యే అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ఎలాంటి మందుల కొరత లేదు.

అంకుల్ నాతో హోలీ ఆడతారా..

- ఎమ్మెల్యేను ముచ్చటగా అడిగిన బాలుడు
- చిన్నారితో కలిసి కాసేపు హోలీ ఆడి ముచ్చట తీర్చిన ఎమ్మెల్యే బొజ్జు


ఎమ్మెల్యేపై రంగులు చల్లుతున్న బాలుడు.. రాణా చెంపలపై రంగుపూస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఖానాపూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో సెలవు దొరకడంతో ఎంతో బిజీ షెడ్యూల్ నడుమ శనివారం ఖానాపూర్‌లో సాగిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పర్యటనలో ఓ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ఖానాపూర్‌లోని పద్మావతి నగర్‌లో ఎమ్మెల్యే పర్యటిస్తుండగా తమ ఇంటి వైపు నుండి వెళ్తున్న ఎమ్మెల్యేను చూసి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్ తనయుడు (10 ఏళ్ల బాలుడు) రాణా 'అంకుల్ నాతో హోలీ ఆడతారా' అంటూ పలకరించాడు. ఆ చిన్నారి బాలుడు ముచ్చటగా అడగడంతో స్పందించిన ఎమ్మెల్యే ఓకే ఆడతా అంటూ నవ్వుతూ సమాధానం చెప్పారు. దీంతో చిన్నారి రాణా ఇంట్లోకి పరిగెడుతూ వెళ్లి రంగు తెచ్చి ఎమ్మెల్యేపై చల్లాడు. అనంతరం ఎమ్మెల్యే బొజ్జు సైతం అదే రంగును తీసుకుని చిన్నారి రెండు చెంపలకు పూసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఆసక్తికర ఘటనతో అక్కడ ఉన్న వారంతా తమ బిజీ షెడ్యూల్ నుండి బయటకు వచ్చి కాసేపు నవ్వుకుని శుక్రవారం ముగిసిన హోలీ సంబరాలను మరోసారి గుర్తు చేసుకున్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

ఖానాపూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో శనివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఖానాపూర్ మాజీ వైస్ ఎంపీపీ తోట సత్యం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో ఎమ్మెల్యే ఆయనను పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఇటీవల మృతి చెందిన రమేష్, ఆముద కిషోర్‌ల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే వారి మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కిషోర్ కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, ఖానాపూర్ పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప సత్యనారాయణ రెడ్డి, సత్తనపల్లి పీఏసీఎస్ చైర్మన్ ఆమంద శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మున్సిపల్ మాజీ చైర్మన్లు చిన్నం సత్యం, అంకం రాజేందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడార్ల గంగా నర్సయ్య, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కావలి సంతోష్, జిల్లా నాయకులు మడిగెల గంగాధర్, జంగిలి శంకర్, ద్యావతి రాజేశ్వర్, లక్ష్మీపతి గౌడ్, అశోక్, తదితరులున్నారు.

గ్రూప్- 2, 3లో విద్యార్థి ప్రతిభ



నిర్మల్ రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అక్కాపూర్ గ్రామానికి చెందిన కే. రాజేందర్, గంగామణిల కుమారుడు రుచేందర్ ఇటీవల విడుదలైన గ్రూప్- 2లో 174 ర్యాంక్, గ్రూప్- 3లో 112 ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా శనివారం ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు బోనుల గంగాధర్ రుచేందర్‌ను సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బోండ్ల గంగన్న, కే. గంగాధర్, సాగర్ పాల్గొన్నారు.

ఉరి వేసుకొని ఒకరి మృతి


మృతుడి వివరాలను తెలుసుకుంటున్న పోలీసులు

కడెం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొర్రిగూడెం గ్రామానికి చెందిన ఆకుల సత్తన్న(42) ఉరి వేసుకుని మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే... ఆకుల సత్తన్న కూలీ పని చేసుకుంటూ బ్రతికేవాడని, పెళ్లి అయి 20 ఏళ్ల నుండి సంతానం లేదనే బాధతో అతని భార్య గత 2 సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుండి సత్తన్న మద్యానికి బానిసయ్యాడు. నాకు భార్య, పిల్లలు లేరు అని మనస్తాపానికి గురై రెండు మూడు సార్లు ఆత్మహత్య యత్నం చేశాడు. శుక్రవారం ఉదయం నుంచి మద్యం సేవించిన సత్తన్న శనివారం లేని చూసే సరికి ఆకుల రాజు ఇంటి బాత్‌రూమ్‌లో లోపల గడియ పెట్టుకొని బాత్ రూమ్‌లోని ఇనుప పైప్‌కు ఆకుల సత్తన్న ఉరి వేసుకొని చనిపోయాడు. మృతుడు తమ్ముడు ఆకుల శంకర్ ఫిర్యాదు మేరకు కడెం ఎస్సై ఎం. కృష్ణసాగర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి


ఘటన స్థలంలో మల్లయ్య మృతదేహం

నర్సాపూర్(జి), మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నసీరాబాద్ గ్రామానికి చెందిన బొందుగుల మల్లయ్య విద్యుత్ షాక్‌తో మరణించాడు. వివరాల్లోకి వెళ్తే... మల్లయ్యకు గ్రామ శివారులో దాదాపు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ వ్యవసాయ భూమిలో మక్క పంటను వేశాడు. పంటను అడవి జంతువులు పాడుచేస్తుండడంతో అడవి జంతువుల నుండి పంటను రక్షించుకోవడానికి సోలార్ ఫెన్సింగ్ చెడిపోవడంతో జీఐ వైర్‌ను చుట్టి దానికి శుక్రవారం కరెంట్ కనెక్షన్ ఇచ్చాడు. మల్లయ్య ఇంటికి రాకపోయేసరికి అతని భార్య చిన్నక్క చేనులోకి వెళ్లి చూడగా చిన్నయ్య మృతి చెంది ఉన్నాడు. భార్య ఫిర్యాదు మేరకు నర్సాపూర్(జి) ఎస్సై సాయికిరణ్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

నర్సాపూర్(జి), మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నసీరాబాద్ గ్రామం వద్ద శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. లోకేశ్వరం మండలంలోని ఎద్దూర్ పోట్‌పెల్లి గ్రామానికి చెందిన గంజిగం కార్తీక్(19) నిర్మల్ నుంచి తన ఇంటికి మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా నసీరాబాద్ గ్రామ మలుపు దగ్గరికి వచ్చేసరికి చాక్‌పల్లి నుండి నిర్మల్ వైపు షాదుల్లా అనే వ్యక్తి తన టీవీఎస్ ఎక్సెల్‌ను అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ ఎదురుగా వస్తున్న గంజిగం కార్తీక్ మోటార్ సైకిల్‌ను ఢీకొట్టాడు. దీంతో కార్తీక్ ఎడమ కాలు విరిగింది. వెంటనే ఇరుగుపొరుగు వారు చికిత్స గురించి 108 అంబులెన్స్‌లో నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన


తరగతి గదిలో విద్యార్థులతో కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్


విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్ రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేసేలా రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతుందని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. శనివారం మండలంలోని మేడిపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ఏఐ ఆధారిత కంప్యూటర్ ల్యాబ్‌ను కలెక్టర్ ప్రారంభించారు. విద్యార్థులకు కృత్రిమ మేధస్సు (ఏఐ) ద్వారా ప్రాథమిక స్థాయిలో చదవడం, రాయడం, గణితం సబ్జెక్టుల నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రాజెక్టులో భాగంగా జిల్లాలో 16 ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ ఆధారిత కంప్యూటర్ ల్యాబ్‌లను ప్రారంభించుకోవడం జరిగిందని తెలిపారు. 3 నుండి 5వ తరగతి విద్యార్థులకు ఏఐ ఆధారిత విద్యా యాప్‌లు, ప్లాట్‌ఫామ్‌లు ప్రతి విద్యార్థి అభ్యాస స్థాయిని గుర్తించి, మెరుగుపరిచేందుకు ప్రత్యేక పాఠాలను సూచిస్తాయని తెలిపారు. ఏఐ ఆధారిత యాప్‌లు కథలు, వీడియోలు, ఆటల ద్వారా పిల్లల్లో చదవడం, లెక్కించడం మీద ఆసక్తిని పెంచుతాయని, కృత్రిమ మేధస్సును వినియోగించుకుని, ప్రతి విద్యార్థి ప్రాథమిక విద్యలో నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని కోరారు. ప్రతి విద్యార్థి ఆరోగ్య, విద్యా, ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతీ రోజు మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కలెక్టర్ మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి. రామారావు, తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో గజేందర్, విద్యాశాఖ అధికారి సలోని, ప్రవీణ్, లింబాద్రి, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు నాగరాజు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

లే అవుట్ల క్రమబద్ధీకరణకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

నిర్మల్ కల్చరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : లే అవుట్ల క్రమబద్ధీకరణకు (ఎల్ఆర్ఎస్) దరఖాస్తుదారులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. ఇప్పటి వరకు జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలో 17,906, గ్రామీణ ప్రాంతాల్లో 6,680 దరఖాస్తులను రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపుకు అవసరమైనవిగా గుర్తించినట్టు తెలిపారు. ఇప్పటికే పలువురు దరఖాస్తుదారులు రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చార్జీలలో 25 శాతం రాయితీ కల్పించామని తెలిపారు. ఈ నెల 31తో గడువు ముగుస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. గడువు తరువాత మళ్లీ రిజిస్టర్ చేసుకునే అవకాశం ఉండదని గమనించాలన్నారు.

ప్రతి ఒక్కరూ జ్ఞానదీక్ష తీసుకోవాలి


మాట్లాడుతున్న చాకేటి లక్ష్మణ్

భైంసా రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ జ్ఞాన దీక్ష తీసుకోవాలని బుద్ధ చారి, చాకేటి లక్ష్మణ్‌లు అన్నారు. భైంసా మండలం తిమ్మాపూర్ గ్రామంలో శనివారం జ్ఞానదీక్షను ఇచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మార్చి 15 నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14వ తేదీ వరకు ఈ దీక్ష నెల రోజులపాటు కొనసాగుతుంది. దీక్ష స్వీకరించే వారు సాధ్యమైనంత వరకు తెల్లని దుస్తులు ధరించాలని, ఈ నెల రోజులపాటు మాంసాహారానికి, మద్యపానికి, దూరంగా ఉండాలి. ప్రతి రోజు ఉదయం 5 గంటలకు లేచి ధ్యానం, నడక, వ్యాయామం, యోగ వంటివి చేయాలి. బహుజన మేధావుల, మహానుభావుల జీవిత చరిత్రను చదువుతూ ఈ జ్ఞానాన్ని సమ సమాజ నిర్మాణంలో బడుగు, బలహీన వర్గాల వారందరికీ మహానుభావుల గొప్పతనాన్ని, జ్ఞాన సంపదను పరిచయం చేయడమే దీని ముఖ్య ఉద్దేశం. ఈ జ్ఞానదీక్షను తిమ్మాపూర్ గ్రామంలో బీఎస్ఐ సెంట్రల్ టీచర్ బుద్ధ చారి, చాకేటి లక్ష్మణ్ చేతుల మీదుగా భీమ్ దీక్ష స్వీకరించడం జరిగింది. ఈ దీక్షను స్వీకరించిన వారు ఎస్. శేఖర్, బి. గోపి, కే. మహేందర్, ఇతరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ

వాహన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలి


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై

తానూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు ప్రతి ఒక్కరు వాహనాలకు సంబంధించి, డ్రైవింగ్‌కు సంబంధించి పత్రాలను కలిగి ఉండాలని ఎస్సై శ్రీనివాస్ అన్నారు. శనివారం తానూర్‌లోని ముధోల్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. రోడ్డుపై వెళ్తున్న పలు వాహనాలను ఆపి ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పెట్రోకార్ మహిళ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ముధోల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ముధోల్ ఎస్సై సంజీవ్ అన్నారు. మండల కేంద్రమైన ముధోల్‌లోని ఐకేపీ కార్యాలయంలో శనివారం మానవ అక్రమ రవాణా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... చట్టంపై అన్ని గ్రామాల్లో వీవోఏలకు, స్వయం సహాయక సంఘాల మహిళలకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై క్లుప్తంగా వివరించారు. ఎంపీడీవో శివకుమార్, ఏపీఎం గురుచరణ్, ఏపీవో శిరీషారెడ్డి, సీసీలు సూర్యకాంత్, వందేమాతరం, పోశెట్టి, గోదావరి, స్వయం సహాయక సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కడెంలో అంగన్‌వాడీ టీచర్‌పై దాడి


అంగన్‌వాడీ టీచర్లతో భూక్యా రమేష్

కడెం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో లింగాపూర్‌కు చెందిన శ్రీలత అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం ఆమె అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన పలువురు ఆమెపై విచక్షణారహితంగా దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ ఆమెను 108లో నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. కాగా దాడికి గల కారణాలు తెలియాల్సి ఉంది. నిందితులను కఠినంగా శిక్షించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు భూక్యా రమేష్ అన్నారు. మండలంలోని అంగన్‌వాడీ టీచర్లతో కలిసి కడెం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమెపై దాడికి పాల్పడడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరి, విజయలక్ష్మి, గంగామణి, సునీత, తదితరులు పాల్గొన్నారు.

28న భవన నిర్మాణ కార్మికుల చలో ఢిల్లీ

నిర్మల్ కల్చరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 28న ఛలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టినట్టు సీపీఐ నాయకులు తెలిపారు. శనివారం ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ పార్టీ కార్యాలయంలో గోడ ప్రతులను ఆవిష్కరించారు. 52 వర్గాల కార్మికులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. దేశ వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి చట్టం కోసం డిమాండ్ చేయనున్నట్టు తెలిపారు. కుసుమకుమార్, నసీర్, ఆవీస్, తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు